క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలి


తండావాసులతో మాట్లాడుతున్న రాహుల్‌నాయక్

కుల్కచర్ల: సమస్యల పరిష్కారానికి గిరిజనులు సంఘటితం కావాలని అఖిల భారత బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాహుల్ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని హన్మ్యనాయక్ తండాలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, చందర్ పాల్గొన్నారు.

ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభం


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్ అర్బన్: మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ ఏ చంద్రశేఖర్ పుట్టిన రోజు వేడుకలను పార్టీ కార్యకర్తలు, అభిమానులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభించారు. స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద ఎప్పుడు అంబులెన్స్ అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఉచితంగా వినియోగించుకోవచ్చునని చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాధవరెడ్డి, పాండుగౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణకు ఘన సన్మానం


నారాయణను సన్మానిస్తున్న శ్రీనివాస్

కొడంగల్: రాష్ట్ర కనీస వేతనాల సంఘం చైర్మన్ నారాయణను తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఏ శ్రీనివాస్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వికారాబాద్ జిల్లా మన్నెగూడలో జరిగిన కార్యక్రమంలో శాలువా కప్పి సత్కరించారు. ఉద్యమ నాయకుడు నారాయణను ప్రభుత్వం కనీస వేతనాల సంఘం చైర్మన్‌గా నియమించినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్వేరో నాయకులు ఎం శ్రీనివాస్, మాదిరెడ్డిపల్లి ఎంపీటీసీ విజయకుమార్, నాయకులు రఫీ, లక్ష్మణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రషర్‌మిషన్ ఏర్పాటు సరికాదు

పీఎస్‌పీఎస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

కుల్కచర్ల: పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన క్రషర్‌మిషన్ అనుమతులు రద్దు చేసి వెంటనే పనులను ఆపాలని పరిగి పరిరక్షణ సమితి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆ సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హిందూ శ్మశానవాటికను ఆనుకుని క్రషర్‌మిషన్ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. క్రషర్ మిషన్ చుట్టూ పచ్చని పొలాలు ఉన్నాయని తెలిపారు. క్రషర్ మిషన్ కారణంగా పర్యావరణానికి హాని కలుగుతోందని పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా ఈ అంశాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కేశంపేట: మండలంలోని బోదునంపల్లిలో ఇటీవల చాకలి నర్సింహ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో దశదినకర్మ నిమిత్తం మృతుడి కుటుంబ సభ్యులకు గురువారం ఆర్థిక సాయం చేశారు. స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల శ్రావణ్‌రెడ్డి రూ.5వేలు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ లక్ష్మీనారాయణగౌడ్ రూ.5వేలు, లేమామిడి సర్పంచ్ శ్రీశైలంగౌడ్ రూ.3వేలు, పిప్పళ్ల శేఖర్ రూ.3వేలు, బీరప్ప రూ.3వేలు, సర్పంచ్ కళమ్మ రెండు వేలు, లావణ్య రెండు వేలు ఇచ్చారు.


దోమ పెద్దచెరువులో మహిళలతో కలసి బతుకమ్మలను వదులుతున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి


బొంరాస్‌పేట: చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు


దౌల్తాబాద్ నుంచి చెరువు వద్దకు బోనాలతో వెళ్తున్న మహిళలు

చెరువుల పునరుద్ధరణ ఘనత కేసీఆర్‌దే

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

దోమ: మండల వ్యాప్తంగా చెరువుల పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పెద్ద చెరువు వేడుకలో ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం చెరువులో చేపల కోసం వల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా చెరువులను పునరుద్ధరణ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతులు బాగుండాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇందులో భాగంగానే చెరువుల పునరుద్ధరణ, ఆయకట్టు స్థిరీకరణ, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డీ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, రైతు సమన్వయ సమితి మండల కో–ఆర్డినేటర్ లక్ష్మయ్య ముదిరాజ్, పరిగి మార్కెట్ కమిటి చైర్మన్ సురేందర్ కుమార్ పాల్గొన్నారు.

కేసీఆర్ చొరవతోనే..

బషీరాబాద్: మిషన్ కాకతీయ ఫలితంగానే నేడు ఊరూరా ధాన్యం రాశులు దర్శనమిస్తున్నాయని ఎంపీపీ కరుణ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువుల వద్దకు బోనాలతో వెళ్లి హారతులు పట్టారు. బషీరాబాద్ చెరువు వద్దకు ఎంపీపీ కరుణ, సర్పంచ్ ప్రియాంక బోనాలతో వెళ్లారు. సీఎం కేసీఆర్ ముందు చూపుతో వేసవిలోనూ చెరువులు నీటితో కళకళలాడుతున్నాయని అన్నారు. నీళ్లపల్లి, మంతట్టి, కాశీంపూర్, దామర్‌చెడ్ తదితర గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా సాగాయి.

ఘనంగా చెరువుల పండుగ

కొడంగల్: పట్టణంలో గురువారం చెరువుల పండుగను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని రెండో వార్డులో మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నుంచి కొడంగల్ పెద్ద చెరువు వరకు ఊరేగింపుగా వెళ్లారు. చెరువు కట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఊరూరా చెరువుల పండుగను విజయవంతం చేసినట్లు రెండో వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్ తెలిపారు.

దౌల్తాబాద్ మండలంలో..

దౌల్తాబాద్: మండలంలో గురువారం చెరువుల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చెరువుల వద్దకు మహిళలు బోనాలతో వెళ్లి బతుకమ్మలతో ఆడి పాడారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ మహిపాల్, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ శిరీష, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా చెరువుల పండుగ

బంట్వారం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం బంట్వారం కోట్‌పల్లి మండలాల్లో చెరువుల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చెరువు కట్టలను అలంకరించి ఆటపాటలతో బతుకమ్మలు ఆడి చెరువుల్లో నిమజ్జనం చేశారు. డప్పుల చప్పుళ్లతో బోనాలతో బయల్దేరి చెరువు కట్ట సమీపంలోని అమ్మవార్లకు బోనాలు, నైవేద్యం సమర్పించారు. అనంతరం ప్రజాప్రతినిధులు నాయకులు అధికారులు గ్రామస్తులు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో సుల్తాన్‌పూర్, బంట్వారం, కోట్‌పల్లి, కరీంపూర్, కొత్తపల్లి, ఇందోల్ సర్పంచులు బీ నర్సింలు సుందరి అనిల్, విజయలక్ష్మి, మల్లయ్య, రాంచందర్ పాల్గొన్నారు.

ఊరూరా చెరువుల పండుగ

పరిగి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆయా గ్రామాల్లో చెరువుల వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని లక్నాపూర్, రంగంపల్లి, మిట్టకోడూరు తదితర గ్రామాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. సీఎం కేసీఆర్ చొరవతో చెరువులు నీటితో కళకళలాడుతున్నాయని పేర్కొన్నారు.

చెరువులే రైతులకు ప్రాణాధారం

మోమిన్‌పేట: చెరువులు రైతులకు ప్రాణాధారమని పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండుగను నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల చెరువుల వద్ద మహిళలు బోనాలతో సంబురాలు నిర్వహించారు.

కట్టమైసమ్మకు బోనాలు

వికారాబాద్ అర్బన్: ఊరూరా చెరువుల పండుగ సందర్భంగా గురువారం మున్సిపల్ పరిధిలోని శివారెడ్డి పేట్ చెరువు వద్ద కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి సంబురాలు నిర్వహించారు. అనంతరం ప్రజలకు భోజనాలు వడ్డించారు. చెరువు కట్టను విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, ఆర్‌ఓ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్ మండలంలో..

పెద్దేముల్: మండలంలో గురువారం చెరువుల పండుగ ఘనంగా జరిగింది. మంబాపూర్, జనగాం, పెద్దేముల్, ఇందూరు, కొండాపూర్, తట్టెపల్లి, ఆత్కూర్, దుగ్గాపూర్, గాజీపూర్, రుక్మాపూర్ వేడుకల్లో ఎంపీడీఓ లక్ష్మప్ప, ఎంపీఓ షేక్‌సుష్మా, ఆర్‌ఐ రాజిరెడ్డి పాల్గొన్నారు.

మర్పల్లి మండలంలో..

మర్పల్లి: మండలంలో గురువారం చెరువుల పండుగను అధికారులు ఘనంగా చేపట్టారు. ఆయా చెరువుల వద్ద దేవతలకు మహిళలు బోనాలు సమర్పించారు. బతుకమ్మలతో సంబరాలు చేపట్టారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అనిత, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సోయేల్, తహశీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ రాజ్ మల్లయ్య, ఏఓ మహేష్, సర్పంచ్ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంబురంగా చెరువుల పండగ

కుల్కచర్ల: చౌడాపూర్, కుల్కచర్ల మండలాల్లో చెరువుల పండగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల చెరువుల వద్ద బోనాలతో సంబరాలు నిర్వహించారు.తిర్మలాపూర్‌లో డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బొంరాస్‌పేట మండలంలో..

బొంరాస్‌పేట: మండలంలో గురువారం చెరువుల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల చెరువుల వద్ద దేవతలకు పూజలు చేసి బతుకమ్మలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

వికారాబాద్ మండలంలో..

అనంతగిరి: వికారాబాద్ మండలంలో చెరువుల పండును జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో పోతురాజుల విన్యాసాలు, బతుకమ్మల ఊరేగింపు ఆకట్టుకున్నాయి. సర్పన్‌పల్లి ప్రాజెక్టు వద్ద జరిగిన సంబరాల్లో కలెక్టర్, ఎమ్మెల్యే పాల్గొన్నారు.


కుల్కచర్ల: తిర్మలాపూర్ చెరువులో బతుకమ్మను వదులుతున్న మనోహర్‌రెడ్డి తదితరులు


బషీరాబాద్: జీవన్గీలో బోనాల ఊరేగింపు


కొడంగల్‌లో..


మోమిన్‌పేటలో బతుకమ్మలతో మహిళలు

నేడు మండల సమావేశం

బంట్వారం: కోట్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు సంక్షేమ సంబరాలు

కొడంగల్: నియోజకవర్గంలో శుక్రవారం తెలంగాణ సంక్షేమ సంబరాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆసరా పింఛన్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతు బీమా వంటి అన్ని సంక్షేమ పథకాల లబ్ధిదారులతో సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో ఎంత మంది లబ్ధి పొందారో ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బహిరంగ సభలో ప్రజలందరూ పాల్గొని దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

కుల్కచర్ల: మండలంలోని కామునిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ పండరీబాయి ఆధ్వర్యంలో గురువారం అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ మాట్లాడుతూ... చిన్నారుల తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు ప్రాథమిక విద్యను నేర్చుకునేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. చిన్నారులకు చిన్న చిన్న వస్తువుల ద్వారా అక్షరాలను గుర్తించేందుకు మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు వెంకటమ్మ, అరుణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీలో యువకుల ప్రతిభ


విజయం సాధించిన జట్టు

బషీరాబాద్: పట్టణంలో వారం రోజులుగా జరుగుతున్న పీఎంఆర్ క్రికెట్ టోర్నీలో యువకులు తమ క్రీడాప్రతిభను కనబరుస్తున్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన యువకుల పేర్లను నిర్వాహకులు నమోదు చేసుకుంటున్నారు. గురువారం జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌లో మంతన్ గౌడ్ తండా, ఎక్మాయి జట్లు తలపడ్డాయి. ఇందులో మంతన్‌గౌడ్‌తండా జట్టు విజయం సాధించింది. అలాగే, బషీరాబాద్ రియాజ్ 11, కొర్విచెడ్ జట్ల మధ్య జరిగిన పోటీలో కొర్విచెడ్ జట్టు విజయం సాధించింది.

సమస్యల పరిష్కారానికే ‘పల్లెబాట’


చెరువుముందలి తండా(ఎ)లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: ప్రజా సమస్యల పరిష్కారానికే పల్లెబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని హన్మ్య నాయక్ తండా, చెల్లాపూర్, చెరువుముందలి తండా(ఎ), ఇప్పాయిపల్లి, రాంపూర్ గ్రామాల్లో పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. చెల్లాపూర్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, 8రోజులుగా నీరు సరఫరా కావడం లేదన్నారు. దీంతో పొలాల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నామని ఎమ్మెల్యేకి వివరించారు. 20రోజుల నుంచి వరి ధాన్యం ఇళ్ల వద్దే ఉందని, కొనుగోలు కేంద్రాలకు తేరాదని నిర్వాహకులు చెబుతున్నట్లు రైతులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే రెండు రోజుల్లో కొత్త బోరు వేయించి నీటి ఎద్దడిని నివారిస్తామని హామీ ఇచ్చారు. కొంత ఆలస్యం జరిగినా రైతులు పండించిన ప్రతి గింజా కొంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, సర్పంచులు హీరీబాయి, చంద్రయ్య, పద్మ, అనురాధ, మంజుల, నాయకులు ఆంజనేయులు, మొగులయ్య, రఘు, లక్ష్మయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

ఆశల పల్లకిలో బీసీలు

- రుణాల కోసం నిరీక్షిస్తున్న యువత
- పెరుగుతున్న ఆశావహులు సంఖ్య
- కుల, ఆదాయ పత్రాల కోసం మీ సేవా కేంద్రాలకు క్యూ

దౌల్తాబాద్: బీసీలకు వ్యక్తిగత రుణాల ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి. ఎప్పటి నుంచో నిరీక్షిస్తున్న యువత అర్జీలు పెట్టుకునేందుకు క్యూ కడుతున్నారు. తెలంగాణ దశాబ్ది వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం స్వయం ఉపాధికి బాటలు వేసేందుకు రుణాలివ్వాలని తీసుకున్న నిర్ణయంతో ఆశావహుల సంఖ్య పెరుగనుంది. ఈ నెల 20వ తేదీ వరకు గడువును నిర్ణయించడంతో చిరువ్యాపారులతో పాటు కొత్తగా ఉపాధిని అందుకోవాలనుకునే వారు ఆన్‌లైన్ కేంద్రాలకు, రెవెన్యూ కార్యాలయాలకు కుల, ఆదాయ ధ్రువీకరణ, సహా ఇతర పత్రాలను సమకూర్చుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవడంతో ముందుగానే వివరాల్ని చేయించుకోవాలని చూస్తున్నారు.

అర్హులకు అందేనా ?

గతంలో బీసీ కార్పొషన్ ద్వారా మూడు కేటగిరీలుగా అందించిన రుణ సాయం విషయంలో ఎక్కువగా పైరవీలకే ప్రాధాన్యత ఇచ్చారనే ఆరోపణలు వినిపించాయి. వచ్చిన దరఖాస్తుల్లో నుంచి తుది జాబితాలో ఎక్కువగా నాయకులు వారి అనుచరగణానికి చోటిచ్చారనే విమర్శలున్నాయి. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటైన తర్వాత కొన్నేళ్లపాటు ఇచ్చిన ఈ సాయం తరువాత నిలిపివేశారు. దాదాపు ఏడేళ్ల తర్వాత మళ్లీ తెరమీదకు రుణాల ప్రస్తావన రావడంతో నిరుద్యోగ యువతలో ఆశలు చిగురిస్తున్నాయి. పైగా గతానికి భిన్నంగా ఈ సారి లక్ష రూపాయల రుణం వందశాతం రాయితీతో అందిస్తుండడంతో ఎందుకు ఈ అవకాశాన్ని వదులుకోవాలనే ఉద్దేశంతో అందరూ చొరవ చూపుతున్నారు. అప్పట్లో కేటగిరీ –1 కింద 75వేల నుంచి రూ. లక్ష, కేటగిరీ –2 కింద రూ. 2లక్షల వరకు, కేటగిరీ –3 కింద రూ. 5లక్షల నుంచి రూ.10లక్షల వరకు రాయితీ రుణం అందేది. ఈ సారి తక్కువ మొత్తంతో ఎక్కువ మంది బీసీ లబ్ధిదారులకు చేయూతనివ్వాలని సర్కారు భావిస్తోంది.


మీ-సేవా కేంద్రంలో కుల, ఆదాయ పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు

పెరగనున్న పోటీ

ఈ సారి అర్హుల ఎంపిక విషయంలో విపరీతమైన పోటీ ఉండనుంది. దీంతో కొందరు ఎందుకైనా మంచిదని ముందుగానే ఓ మాట తమకు తెలిసిన నాయకులకు చెబుతూనే అర్జీ పెట్టుకుంటున్నారు. 2018లో సుమారు మండలంలో 1,500మంది దర ఖాస్తులు చేసుకున్నారు.ఈ సారి ఎక్కువగానే దర ఖాస్తులు వస్తాయని అంచనా. స్వయం ఉపాధితో ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఆశతో ప్రతి ఏడాది బీసీలంతా రుణాల కోసం నిరీక్షిస్తూ వస్తున్నారు. ఎట్టకేలకు ఈసారి తీసుకున్న నిర్ణయంతో తక్కువ రుణమైనా ఎక్కువ రాయితీతో అందుతుందనే ఉత్సాహంతో ఆ దిశగా యువత అడుగులేస్తున్నారు.

సైబర్ నేరాలపై విస్తృత ప్రచారం

బస్టాండ్లు, ప్రధాన కూడళ్లలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొడంగల్ రూరల్: సైబర్ నేరగాళ్లు సామాన్య ప్రజలకు డబ్బును ఆశ చూపుతూ వారి బ్యాంక్ ఖాతాల్లోని నగదును క్షణాల్లో స్వాహా చేస్తున్నారు. దీంతో ప్రజలను అప్రమత్తం చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. జనసంచారం ఉన్న ప్రాంతాలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడరాదని సూచిస్తున్నారు. ఈజీ మనీకి అలవాటు పడిన సైబర్ నేరగాళ్లు ప్రజల ఫోన్లకు లింకులు పంపుతున్నారని, వాటిని క్లిక్ చేసి వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడంతో అకౌంట్‌లోని డబ్బులు మాయం అవుతున్నాయి. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలీసులు చెబుతున్నారు. మత్తు పదార్థాలు సేవించినా, వాటిని విక్రయించినా చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిస్తేనే సురక్షితం

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే సురక్షితంగా గమ్యం చేరుకోవచ్చని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. హెల్మెట్ ప్రాధాన్యత, మద్యం సేవించి వాహనాన్ని నడపడంతో ప్రమాదాలు జరుగుతాయని, చిన్నారులకు వాహనాలుఇవ్వకూడదని తదితర జాగ్రత్తలు వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా వాహనదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచిస్తున్నారు.


చిట్లపల్లి గేటు వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రవిగౌడ్

మాయమాటలు నమ్మొద్దు

సైబర్ నేరగాళ్లు ఫోన్లకు పంపే మెసేజీలను ఓపెన్ చేయరాదు. ఈ లింక్‌ను క్లిక్ చేస్తే మీకు డబ్బులు వస్తాయని ఆశ పెడితే నమ్మి మోసపోవద్దు. మీ వ్యక్తిగత బ్యాంకు సమాచారం గోప్యంగా ఉంచాలి. ఇతరులకు తెలిస్తే అకౌంట్లో డబ్బులు పోయే అవకాశం ఉంది. అలాగే డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. రోడ్డు నిబంధనలు పాటిస్తే సురక్షితంగా ఇంటికి చేరుకోవచ్చు. – రవిగౌడ్, ఎస్‌ఐ, కొడంగల్

క్రీడలతో స్నేహభావం

ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

పెద్దేముల్: క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలో కొనసాగుతున్న పీఎంఆర్ టోర్నమెంట్‌ను ఆయన పరిశీలించారు. మారుమూల మండలంలో నిర్వహించిన పోటీల్లో 40 జట్లు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పురుషోత్తమరావు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ నారాయణ రెడ్డి, తట్టెపల్లి పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు నర్సింలు, మాజీ సర్పంచ్‌లు కిషన్‌రావు, బాలప్ప, నాయకులు మైపాల్‌రెడ్డి, విఠల్, పోటీల నిర్వాహకులు అరుణ్‌కుమార్, కార్తీక్‌రెడ్డి, ఆదర్శరెడ్డి, అన్వర్, డివై, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మహేంద్‌రెడ్డి